

జగ్గంపేటలో అరుణోదయ కళాకారుల ప్రదర్శన



కిర్లంపూడిలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు



ఏలేశ్వరంలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

అరుణ పతాక రెపరెపలు

- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

ఏలేశ్వరం: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం వాడవాడలా అరుణపతాకం రెపరెపలాడింది. నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఏలేశ్వరంలో పలు కార్మిక సంఘాల నేతలు విడివిడిగా మేడే వేడుకలను నిర్వహించారు. అరుణ పతాకాలు ఎగురవేసి వందనాలు సమర్పించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ యూనియన్ వద్ద మేడే వేడుకలు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ, అవసరాల దేవి, తదితరులు పాల్గొన్నారు. క్వారీ లారీ మోటారు వర్కర్స్ యూనియన్, సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలోనూ మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఎం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, ఆశ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లా రాంబాబు, కె.సునీత, అమరావతి, రౌతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. క్వారీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి కుప్పల నాగభూషణం, దేరంగుల రాజు, బత్తుల రాజబాబు, నీలపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాట ఫలితమే..

గండేపల్లి: కార్మికుల పోరాట ఫలితంగానే మే డేను జరుపుకుంటున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరుబండి చంద్రవతి అన్నారు. గురువారం గండేపల్లిలో మే డే వేడుకలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఎగుర వేశారు. అనంతరం ర్యాలీగా చెరువు గట్టుపై ఉన్న సీఐటీయు భవనానికి చేరుకుని అక్కడ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, యూటీఎఫ్ సభ్యులు ఎస్.సత్యనారాయణ, పి.చిన్నారావు, వై.శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, ఐసీడీఎస్ కార్యకర్తలు వై.రాజేశ్వరి, పద్మ, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.



తునిలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఘనంగా మే డే

రౌతులపూడి: స్థానిక విద్యాశాఖ కార్యాలయం సమీపంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ, యూటీఎఫ్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మే డే పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధి ఆకుల సత్యనారాయణ, అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ కార్మికులకు పని గంటలు తగ్గించాలని, అంగన్ వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. పారుపాకలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహించారు.

కిర్లంపూడి: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. అంగన్వాడీ, భవన కార్మికులు, వీఓఏలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూరిశెట్టి వీరబాబు, రాజు, తెలగంటి జీవా, శ్రీనివాసరావు, సీహెచ్ రత్నం, ఎం.శుభరత్నం, పి.సావిత్రి, శ్రీదేవి, రాణి తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

కోటనందూరు: ఐక్య పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు దాడి గోవిందు అన్నారు. మే డే సందర్భంగా గురువారం సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ పద్మ ఆధ్వర్యంలో యూటీఎఫ్, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన తయారీ కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. బస్టాండు సెంటర్లో మానవహారంగా ఏర్పడి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్మికులంతా సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు.

జగ్గంపేట: మండలంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక స్టాలిన్ భవన్ నుంచి జేవీఆర్ కాంప్లెక్స్ మీదుగా ఎర్రజెండాలతో అరుణోదయ కళాకారులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద కోరుకొండ శ్రీనివాస్ ఎర్రజెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ సభ్యుడు చిట్టిబాబు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అమెరికాలో ఉన్న భారతీయులను తిరికి ఇండియాకు తిరిగి పంపించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రగతి శీల కార్మిక సంఘం ఆంధ్ర కమిటీ సభ్యుడు మోరుకుర్తి రాజు, వివిధ సంఘాల నేతలు కె.శ్రీనివాస్, కె.లక్ష్మి, వి.శాంతి, బి.భవాని తదితరులు పాల్గొన్నారు.

మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం ఆధ్వర్యంలో స్థానిక రంగవల్లి నగర్‌లో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆపరేషన్ కగార్ పేరుతో సాగిస్తున్న మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సంఘ నేతలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ప్రత్తిపాడు, పోతులూరు, లంపకలోవ గ్రామాల్లో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ప్రత్తిపాడులో సీఐటీయూ నేత రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు భూసాల శ్రీను చేతుల మీదగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాడి నాగేశ్వరరావు, దుమ్ముల సింహాచలం, అర్జునుడు, అల్లాడి లక్ష్మీ, రమాదేవి, గంజి కామేశ్వరరావు, బాలాజీ, రాజు, యూటీఎఫ్ నాయకులు రామాలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మేడే సందర్భంగా ఎ.కొత్తపల్లిలో సత్యదేవా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి శివకోటి రాజు కార్మిక జెండాను ఆవిష్కరించారు. కేంద్రం కార్మికులకు వ్యతిరేకంగా చేస్తున్న చట్టాలకు నిరసనగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సత్యదేవా భవన నిర్మాణ సంఘం ప్రెసిడెంట్ అంబుజాలపు నాగేశ్వరరావు, కార్యదర్శి కాలిబోయన శ్రీను, కోశాధికారి నరాల లోవరాజు, ఐ.నాగేశ్వరావు, వెలుగుల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడిలో మే డే పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల సభ్యులు

గోకవరం: మండలంలో కార్మికులు వేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పలు యూనియన్ల కార్యాలయాల వద్ద మేడే జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. గోకవరంలో ఎలక్ట్రికల్ యూనియన్, జట్టు కూలీ సంఘం, తాపీమేస్త్రీల సంక్షేమ సంఘం, రిక్షా కార్మికుల సంఘం, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేడే జెండాను ఆవిష్కరించారు.

తుని: కార్మిక, కర్షక హక్కులను పోరాటాలు ద్వారా సాధించుకోవాలని యూటీఎఫ్ నాయకుడు బ్రహ్మానాయుడు సూచించారు. పట్టణంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో కార్మిక జెండాను యూటీఎఫ్ నాయకుడు బ్రహ్మానాయుడు ఆవిష్కరించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, కార్మిక చట్టాలను సరళీకృతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ధనలక్ష్మి, న్యాయవాది శ్యామల, నాయకులు ఉమామహేశ్వరి, లలిత, దివ్యశ్రీ, రాజేశ్వరి, సంతోషి, మున్సిపల్ కార్మికులు చెక్క అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నేతలు



కోటనందూరులో ర్యాలీ చేస్తున్న కార్మికులు



ప్రత్తిపాడులో జెండాకు వందనం చేస్తున్న కార్మికులు



ఎ.కొత్తపల్లిలో బైక్ ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

క్లుప్తంగా

పోలమ్మ ఆలయం వద్ద అన్నదానం



ప్రత్యేక అలంకరణలో డెక్కల పోలమ్మ అమ్మవారు

గండేపల్లి: తాళ్లూరు గ్రామ దేవత డెక్కలపోలమ్మ ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పండితులు అమ్మవారిని వెండి కవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించగా స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

వైఎస్సార్ సీపీ నేత, జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు సాయి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు బండారు రాజా, ఒబిణ్ని వీరబాబు, జక్కిలింక రామకృష్ణ ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని పలు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిధుల మంజూరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండ తిమ్మాపురం-లింగంపర్తి రోడ్డుకు రూ. 3 కోట్లు, పెద్దనాపల్లి-చిన్నింపేట రోడ్డుకు రూ.1.30 కోట్లు, తిరుమాలి నుంచి తిరుమాలి కాలనీ వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. ఇప్పటికే పలు రోడ్లకు నిధులు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, ఎస్‌జీవీ సుబ్బరాజు, చిక్కాల లక్ష్మణరావు, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడిరాము విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చదువుట, రాయుట, పద్యాలు చదివి భావాలు చెప్పుట, చిత్రలేఖనం, నృత్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన దూడల గోవింద్ ఇటీవల అనారోగానికి గురయ్యారు. వైద్య సేవల అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మురళీరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5000 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

తొండంగి: మండలంలోని తొండంగి, దానవాయిపేట తదితర గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పెద్దాపురం డీఎల్పీవో బాలామణి గురువారం పరిశీలించారు. చెత్త సేకరణ, నిర్వహణపై ఆరా తీశారు. తడి, పొడి చెత్త సేకరణలో సమస్యలు తెలుసుకుని శానిటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

అన్నవరం: మానవ ప్రగతికి కార్మికులు ఎంతో అవసరమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు సరమర్ల మధుబాబు అన్నారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు గురువారం మేడే సందర్భంగా స్థానిక పంచాయితీ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. పార్టీ నాయకులు గణేశుల లక్ష్మణస్వామి, సింగంపల్లి రాము, రాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కత్తిపూడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముద్రగడ గిరిబాబు, యనమల కృష్ణుడు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, పార్టీ నేత యనమల కృష్ణుడు

శంఖవరం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, తుని నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్టీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ గ్రామ స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో మమేకమై సమన్వయంతో పని చేయాలన్నారు. కూటమి పార్టీలపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక చంద్రబాబు చేతులేత్తేశారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, ఎంపీటీసీ చొప్పా రాంబాబు, నాయకులు గాబు కృష్ణ, గౌతు స్వామి, గౌతు నాగు, సకురు గుర్రాజు, గౌతు అర్జుబాబు, అడపా సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి విశేష పూజలు



కిర్లంపూడిలో వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న గిరిబాబు

కిర్లంపూడి: గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం నిర్మించి 200 ఏళ్ల పూర్తయిన సందర్భంగా గురువారం అష్టోత్తర శత కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన శ్రీధర్‌ఆచార్యులు గిరిబాబుకు ఆశీర్వనాలు అందజేసి శాలువాతో సత్కరించారు. తొలిత ఆలయ ట్రస్టీ వెంకటరాజా గోపాల రామకృష్ణ ప్రసాద్ బహదూర్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, గొల్లపల్లి కాశీవిశ్వనాథం, ఎస్ఎస్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడిశెట్టి రాజాను కలసిన మురళీకృష్ణంరాజు

తుని రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాను ఆ పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని తన నివాసంలో దాడిశెట్టి రాజాను కలుసుకుని శాలువాతో సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలు అంకితభావంతో నెరవేర్చాలని, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని దాడిశెట్టి రాజా సూచించారు. నాయకులను, కార్యకర్తలను సమన్వయంతో నడిపించాలన్నారు. పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పరిశీలకుడిగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణంరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.



దాడిశెట్టి రాజాను సత్కరిస్తున్న మురళీకృష్ణంరాజు



విశాఖపట్నంలో బొత్స సత్యనారాయణతో ముదునూరి

బొత్సను కలసిన ముదునూరి

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను విశాఖపట్నంలో ఆ పార్టీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

సంక్షిప్తంగా..

నేడు గోకవరంలో 23 ఆర్టీసీ సర్వీసులు రద్దు

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం 23 ఆర్టీసీ సర్వీసులు రద్దు చేసినట్టు డిపో మేనేజర్ మార్గరేట్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ అమరావతి పర్యటనను పురస్కరించుకుని గోకవరం డిపో నుంచి 30 బస్సులు అమరావతి వెళుతున్న దృష్ట్యా డిపో పరిధిలోని మారేడుమిల్లి, కాకినాడ, అడ్డతీగల, రాజమహేంద్రవరం రూట్లలో పలు బస్సు సర్వీసులను రద్దు చేశామన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

జోరుగా సేవా కార్యక్రమాలు

ప్రత్తిపాడు రూరల్: రితీష్‌పాల్ చెవల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రితీష్‌పాల్ జ్ఞాపకార్థం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మినర్వా ప్రిన్సిపాల్ ఆనంద జోష్ కుమార్, చెవల స్వర్ణ, చెవల తేజ్‌కమల్, చెవల వర్షిత, కనికెళ్ల పిస్కీల్లా తదితరులు పాల్గొన్నారు.

తలపంటిపేటలో ఉచిత వైద్య శిబిరం

తొండంగి: మండలంలోని తలపంటిపేటలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మే డే సందర్భంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫియస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కాకినాడ లేబర్ వెల్ఫేర్ కమిషనర్ బుల్లిరాణి ప్రారంభించారు. డాక్టర్లు వసంత్‌కుమర్, ఎం.సుజన, దుర్గా ప్రసాద్, సతీష్ తదితరులు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లైఫియస్ కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ టి.సాంబశివరావు, కేఎస్ఈజెడ్ ప్రతినిధులు ఎ.శ్రీనివాసరావు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆదిశంకరాచార్య జయంతి

అన్నవరం: జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను అన్నవరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్టు సత్యగాయత్రీ బ్రాహ్మణ సంఘ నాయకుడు, అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు చామర్తి కన్నబాబు తెలిపారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నవరం దేవస్థానానికి చెందిన వ్రతపురోహితుడు దుడ్డు ధన్వంతరి, మంగాదేవి కుమారుడు, యువ పండితుడు దుడ్డు గణేష్ శర్మ ద్రావిడ్ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతీ స్వామి చేతుల మీదుగా సన్యాసదీక్ష స్వీకరించి శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి నామదేయంతో పీఠం ఉత్తరాధికారిగా, తదుపరి 71వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించడం అన్నవరం గ్రామస్తుల అదృష్టమన్నారు. శుక్రవారం తెల్లవారుజామున స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సుబ్బరాయపురంలోని వినాయకుని ఆలయం వద్ద నుంచి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు



కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకుంటున్న జగ్గంపేట విద్యార్థి సామ్యూల్ రాజు, ఎ.కొత్తపల్లి విద్యార్థిని పావని షణ్ముఖి, శంఖవరం మోడల్ స్కూల్ విద్యార్థి బాల మురళీ, రౌతులపూడి మండల టాపర్లు యశ్వంత్, విజయలక్ష్మి

రౌతులపూడి: పదో తరగతి పరీక్షల్లో 567 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పురస్కారాలు అందించారు. మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కర్రి యశ్వంత్, గాది విజయలక్ష్మి గురువారం తమ తల్లిదండ్రులతో కలసి కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ వారిని అభినందించి రూ.10 వేల నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు. గుడ్ స్టూడెంట్ పుస్తకాన్ని అందజేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను కలెక్టర్ సత్కరించారు. ఉత్తమ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎంఈఓ గాది కొండబాబు, ప్రధానోపాధ్యాయులు కోళ్ల రాంబాబు, సతీష్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అన్నందేవుల సామ్యూల్ రాజు 579 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. కాగా గురువారం కాకినాడలో సామ్యూల్ రాజు, అతని తల్లిదండ్రులను కలెక్టర్ షణ్మోహన్ శాలువాతో సత్కరించి రూ.10 వేలు, మెమెంటో అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, ఉపాధ్యాయుడు దాడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: టెన్త్ పరీక్ష ఫలితాల్లో 588 మార్కులతో తొండంగి మండల టాపర్‌గా నిలిచిన ఎ.కొత్తపల్లికి చెందిన తొగర పావనిషణ్ముఖిని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. కాకినాడలో జరిగిన కార్యక్రమంలో పావని షణ్ముఖి, ఆమె తండ్రి తొగర బాబ్జి, కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించి రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు.

టెన్త్ టాపర్‌ను అభినందించిన కలెక్టర్

శంఖవరం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి ఎద్దు బాల మరళిని గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అభినందించారు. మురళికి రూ.10 వేలు నగదును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ పి.రమేష్, మోడల్ స్కూల్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్‌వీ కిరణ్, ఎఈఓ ఎస్వీ రమణ, ఎఈఓ-2 గోవింద్, యూటీఎఫ్ నాయకులు సీతారామయ్య, మురళి తల్లి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.